కథ

# ఓ పాపా లాలీ...

''అలా ఉన్నావేం?''

ఆమె మౌన గోదావరికి చెలియలి కట్ట వేస్తూ అడిగాడు రాజేష్.

ఒక్కసారి కళ్ళు తెరచి అతని కళ్ళలోకి నీరసమైన మెరుపు చూపు చూసి అతని కుడి చేయి తన నుదుట ఉంచుకుని మళ్ళీ కళ్ళు మూసుకుంది ఆమె.

అతడామెను మళ్ళీ ప్రశ్నించలేదు.

అసలు వస్తూనే ''నాకు ఒక్క సాయం చేస్తావా రాజూ?'' అంటూ ఆర్తిగా అడిగిన ఆమె ప్రశ్న అతని హృదయానికి గేలం వేసింది.

''ఏమిటది?''

''పది నిముషాలు నీ ఒళ్లో తల పెట్టుకుని పడుకుంటాను. నన్ను డిస్టర్బ్ చేయవు కదూ?''

బదులుగా చల్లగావున్న ఆ చలువరాతి నేలమీద కూర్చుంటూ ఆమెను తన ఒడిలోకి పసిపాపలా తీసుకున్నాడతను.

''ఓ పాపా లాలీ! జన్మకే లాలీ! ప్రేమకే లాలీ! పాడనా, తీయగా ఓ పాపా లాలీ!''

గీతాంజలి చిత్రంలో తనకు అత్యంత ఇష్టమైన పాటను అతను నిజ జీవితంలో అనుభవిస్తున్నాడతను.

రివ్వున వస్తున్న గాలికి ఎగురుతున్న ఆమె ముంగురుల అల్లరికి ఆమెకు మరల ఎక్కడ విశ్రాంతి భంగం అవుతుందో అన్నట్లుగా సున్నితంగా అతను వాటిని ఆమె చెవుల వెనక్కు తోసాడు.

అయితే అతని మస్తిష్కంలోని ఆలోచన్లలా అవి ముందుకు దూకుతూనే ఉన్నాయి.

ఆమెను సునిశితంగా పరిశీలించాడతను. ఒక పవిత్రమైన వస్తువును పరిశీలిస్తున్న ఆరాధనా భావం అతని చూపులో స్పష్టంగా గోచరిస్తోంది. ఒద్దికగా, బొద్దుగా ఉండే ఆనాటి ముద్దబంతిపువ్వుకి ఈనాటి ఈ ముద్దమందారానికి ఎంతటి తేడా?

''తల్లీ తండ్రీ, కొడుకు కూతురు ఉన్నదే కుటుంబం'' అన్న నిర్వచనానికి తగ్గట్టు ఉండే నిండైన వారి జీవితాలకు హఠాత్తుగా సంపూర్ణ సూర్యగ్రహణం పట్టినట్టు మంచి గవర్నమెంటు జాబ్ చేస్తున్న తండ్రికి పక్షవాతం రావడం, మేడమెట్ల మీద నుంచి జారిపడిపోయిన తల్లికి వెన్నుపూసలో ఒక పూస జారిపోవడంతో మంచం మీద ఉండిపోవడం, అప్పటి వరకు స్కూలు ఫస్టు అనిపించుకున్న తమ్ముడు కాలేజీలో చేరాక చెడు అలవాట్లకు బానిస కావడం ఒక్కసారిగా ఆమెను శిలగా మార్చేసాయి. ఆ శిలలో మిగిలిన ప్రేమ తటాకంలో ఆమె తన కలువ మనసును పెంచుకుంటోంది అపురూపంగా.

నలిగిన పాత కాటన్ చీర ఆమె ఎదనుండి స్థానభ్రంశం చెంది రెపరెపలాడుతోంది.

ఉరః పంజరంలోంచి నీరసంగా కొట్టుకుంటున్న గుండె కనిపిస్తుందా అన్నట్లు ఆమె పలుచని పొట్ట వెన్నుపూసకు అంటుకుపోయి ఆకలికి నాలిక చాచిన కుక్క ఊపిరిలా డొక్కలు ఎగిసెగిసి పడుతున్నాయి.

అప్పుడు చూశాడతను.

ఆమె పొట్టమీద బెల్టుతో కొట్టినట్టుగా రెండు చారికలు.

అతను నిటారుగా అయ్యాడు.

ఆమె పొట్టమీద సున్నితంగా చేయివేసి తడమబోయాడు.

అప్పుడు తగిలింది అతని చేతికి అశ్రుప్రవాహం.

అతను నెమ్మదిగా ఆమెను లేపి భుజాలచుట్టూ చేతులు వేసి ఆప్యాయంగా పొదవి పట్టుకున్నాడు.

''ప్రియా! ఏం జరిగింది?''

ఆమె కళ్లెత్తి చూసింది.

''రాజూ!'' అంటూ అతనిని మరింతగా కరుచుకుపోయి నిద్రలో ఉలిక్కిపడిన చంటిపాపలా వెక్కి వెక్కి ఏడవసాగింది.

''చూడు! అందరూ మనల్నే చూస్తున్నారు. ప్లీజ్ ఏం జరిగిందో నాకు చెప్పవా?''

**''నేనెంత అదృష్టవంతురాల్ని రాజు. నీ ప్రేమికురాలిని అనుకున్నప్పడల్లా అనంతమైన గర్వం నాకు. ఆ! అన్నట్లు మొదటి శ్రావణ మంగళవారం నా పుట్టినరోజు. ఆరోజు నీనుంచి ఎన్నో పొందిన నేను వీలైతే ఓ అపురూపమైన కానుక ఇచ్చుకుంటాను.''**

అతని లాలనతో ఆమెలో ఆశ ఊపిరి తీసుకోవడం ప్రారంభించింది.

''ఏమిటి? అంత నీరసంగా ఉన్నావు? రోజురోజుకు అంత డల్ అయిపోతున్నావేంటి. మన ఇన్నాళ్ల స్నేహంలో నిన్ను ఎప్పుడూ ఇలా చూడలేదు. ఈ నలిగిపోయిన చీరలేంటి? ఈ బెల్టు దెబ్బలేంటి?'' తననుంచి ఆమెను బలవంతంగా విడదీసి ఆమె కళ్ళు తుడిచాడు అతను.

మనసు వేడిమికి విరబూసిన ఎర్రని తామరల్లా ఉన్నాయి ఆమె నయనాలు.

''నాకు బాగా ఆకలిగా వుంది. సిగ్గు విడిచి అడుగుతున్నాను. తినడానికి ఏమైనా తెచ్చిపెట్టగలవా? రెండు రోజులైంది అన్నం తిని!''

రాజేష్ హతాశుడయ్యాడు ఆమె మాటలకి.

''పద వెళ్దాం'' లేచి ఆమెకి చేయి అందిస్తూ.

మానసికమైన వ్యధ కంటి లోయల్లోంచి పెల్లుబికి, మనసంతా తేలికపడినా శరీరానికి స్వాంతన లేని కారణంగా సమాధానం చెప్పలేకపోయిందామె.

అతను ఆమె నడుం చుట్టూ చేయివేసి పిల్ల తెమ్మెర వీస్తున్నంత నెమ్మదిగా లేపాడు ఆమెను.

చల్లని గాలికి నీరసంతో మత్తు ఆవరిస్తున్న ఆమె అతని భుజం మీద తలవాల్చి మెల్లగా అడుగులు వేయసాగింది. అప్పటికే అనేకమంది చూపుల బాణాలు ఛేదించుకుంటూ ముందుకు సాగుతున్న వాళ్ల చెవులకి వద్దన్నా వినిపించాయి. చేతిలో పువ్వుల బుట్టతో మెట్లెక్కుతున్న పశ్చిమ గోదావరి పెద్దవయసావిడ మాటలు.

''ప్రేమ తమకంలో ఎక్కడ ఏం చేస్తున్నారో కూడా తెలియకుండా పోతోంది ఈరోజుల్లో కుర్రమూకకి. దేవుడి గుడి, చదువుకునే బడి అనే తేడా లేకుండా అంత కళ్ళు మూసుకుపోయి ప్రవర్తించడమా? వెధవ పెంపకాలు కాకపోతే!''

ఆ కోవెల మెట్లు దిగిన తర్వాత రోడ్డు దాటి ఎదురుగా వున్న హోటల్‌కు తీసుకువెళ్లాడు ఆమెను రాజేష్.

ఆరోగ్యకరమైన, శరీరానికి రుచికరమైన భోజనం అమృతంలా రుచించి ప్రక్కవారు తననే చూస్తున్నారు అన్న విషయం కూడా మరచి ఆరగిస్తున్న ఆమెను వింతగా చూస్తుండిపోయాడు అతను.

భోజనం పూర్తయి ఆమెకు కొంచెం శక్తి పుంజుకున్నట్టయింది.

వాష్‌బేసిన్ దగ్గర శుభ్రంగా ముఖం కడుక్కుని వచ్చి చీర కొంగుతో తుడుచుకుంటున్న ఆమెను అతను ఆపు చేయలేదు.

''ఇప్పుడు చెప్పు. కాస్త ఓపిక వచ్చిందంటేనే సుమా! లేకపోతే వద్దు'' అడిగాడు తను. తన ముందు కూర్చున్న ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని.

ఆమె అలాగే కుర్చీలో వెనక్కు వాలింది.

''ఏముంది రాజూ! మామూలే. చేతిలో వున్న డబ్బులు నాన్న ఇంజెక్షన్స్‌కి, అమ్మ టానిక్కులకి అయిపోయాయి. నెలాఖరు రోజులు. బియ్యం కొందాం అని ఇరవై రూపాయలు ఉంచుకుంటే నిన్న ప్రొద్దుట బాబి నన్ను బెల్టుతో బాది లాక్కుపోయాడు. అదే ఈ ప్రసాదం'' అంది పొట్టమీద రాసుకుంటూ.

రాజేష్ పర్సులోంచి ఐదు వందనోట్లు తీసి ఇవ్వబోయాడు.

ఆమె సున్నితంగానే తిరస్కరించింది.

''నీ దగ్గర అధికారికంగా తీసుకోనిది ఒక్క డబ్బు మాత్రమే అని నీకు తెలిసే ఎందుకు ఇస్తున్నావు రాజేష్! నీ గుండెల్లో తల దాచుకుని పడుకుంటే ఈ ప్రపంచం ఏమైపోయినా సరే నాకు అవసరంలేదు. నీ దగ్గర నుంచి నేను పొందే మనశ్శాంతికి మాత్రం లెక్క కట్టకు. ఈజన్మ కాదు



కదా ఎన్ని జన్మలైనా తీర్చుకోలేను ఆ ఋణం! అయినా రాజూ! ఈ ప్రపంచంలో ఏ బాధ అయినా భరించవచ్చునే మోగానీ క్షుద్బాధ భరించడం ఎంతటి సహనమూర్తికీ కుదరదేమో!''

ఆమె బేల మాటలు విని అన్నాడతను.

''అయినా నువ్వు ఈ ఓవర్ స్ట్రెయిన్ తగ్గించుకోవా! చివరకు నాకు దక్కేనాటికి చంటిపాప పర్సనాలిటీతో కూడా మిగుల్తావో లేదో!'' డబ్బు పర్సులో పెట్టేస్తూ అన్నాడతను.

''నీకా భయం అక్కర్లేదు. నీ తొలినాటి సుప్రియలా నీ దగ్గరకు వచ్చే పూచీనాది. అంతవరకూ అప్పుడప్పుడు ఇలా నన్ను ఆదుకుంటే చాలు'' ఆమె అతని చేయి సున్నితంగా నొక్కి వదిలింది. ఆమెలోని ప్రేమ వరద గోదావరి కెరటాలు వెచ్చని స్పర్శద్వారా తన నరనరాన ప్రవహిస్తున్నట్లుగా ఫీలయ్యాడతను.

''నీకు ఉద్యోగం వస్తేగానీ మన పెళ్ళి కాదు. మన పెళ్లి అయితేనేగానీ నా బాధ్యతలు తీరవు. అంతవరకూ నీ డబ్బు అప్లికేషన్స్‌కి, నా రక్తం నా కుటుంబానికి ధారపోయక తప్పదనుకుంటా'' నిరాసక్తతగా అందామె.

''ఎలక్షన్స్‌వల్లనే కదా తయారైన ఆర్డర్స్ నాకు ఇంకా రానిది. మన కష్టాలు తీరే రోజు తొందరలోనే వుంది. ఆ వెంటనే అమ్మ, నాన్నల అనుమతితో మన వివాహం!''

''ఈ చిక్కి శల్యమైన శరీరంలో ఏముంది రాజూ! నా అవసరం కోసం వాడుకుంటున్న నీ మనసు తప్ప!''

''ఆ మనసులో నాపట్లగల నీ నిర్మలమైన ప్రేమకే నేను నీకు దాసోహం అన్నది. ఆడది తనను ప్రేమించిన వాడిని చేసుకుంటే మరింత సుఖపడుతుందట. అదే సూత్రం మగవాడికి కూడా వర్తిస్తుంది.''

''నేనెంత అదృష్టవంతురాల్ని రాజు. నీ ప్రేమికురాలిని అనుకున్నప్పుడల్లా అనంతమైన గర్వం నాకు. ఆ! అన్నట్లు మొదటి శ్రావణ మంగళవారం నా పుట్టినరోజు. ఆరోజు నీనుంచి ఎన్నో పొందిన నేను వీలైతే ఓ అపురూపమైన కానుక ఇచ్చుకుంటాను.''

''దేవిగారి ఆజ్ఞ! ఇంటివరకు రానా!''

''వద్దు! ఇక్కడ సిటీబస్ ఎక్కేస్తాను. ఇంటికి వెళ్లాక చాకిరీ ఎలాగూ తప్పదుకదా. అయినా ఈ పూటకు నీతో అవసరం తీరిపోయింది కూడా!'' ఆమె చిలిపిగా నవ్వింది.

అతను సిటీబస్ వచ్చేంతవరకూ ఉన్నాడు.

ఆగిన సిటీబస్ ఎక్కబోతూ అందామె-

''రేపు మళ్లీ నాకు మనశ్శాంతి కోటాని అందించడానికి మన ప్లేసులో రెడీగా వుండు. వస్తాను'' అని చెవిలో గుసగుసలాడినట్లుగా అంటూ ఎవరూ చూడకుండా అతని చెవి కొరికి వదిలింది ఆమె సున్నితంగా.

అతని కళ్లనిండా మెరుపు కలలు స్ట్రీట్‌లైట్ వెలుతురులో తళుక్కుమన్నాయి.

★★★

**కొత్తపల్లి ఉదయబాబు**

అతను ముందు విస్తుబోయాడు.

ఎన్నిసార్లు అడిగినా ఏనాడూ తన గదికి రాని సుప్రియ పిడుగులాంటి వార్త పుట్టినరోజు శుభవార్తగా అందించినప్పుడు స్థబ్దుడైపోయాడు.

అది ఆమె శుభలేఖ!

వధువు-సుప్రియ.

వరుడు-లక్ష్మీనారాయణ.

''సుప్రియా! ఏమిటిది. నాతో పరాచకాలాడుతున్నావా? ఇది...ఇది నీ స్వార్థమా? లేక మీ ఇంట్లో వాళ్ళ బలవంతమా? ఇంచుమించు రోజూ మనం కలుస్తున్నా ఏనాడూ నాతో మాటవరసకైనా అనలేదు. నువ్వు...నువ్వు నీ పుట్టినరోజున ఇస్తానన్న కానుక ఇదా?''

అతడు మెడమీద సన్నని దారంతో పదునైన కత్తి వ్రేలాడుతున్న అమాయకపు గొర్రెలా వున్నాడు.

నీళ్ళు నిండిన విశాలమైన కళ్ళు ఆమె పైకెత్తింది. బుగ్గల మైదానాల వెంబడి ప్రవహించడానికా అన్నట్లు ఒక్క ఉదుటున ఉరకబోయే కెరటాలు. అక్కడ ఇమడలేక ఇబ్బంది పడుతున్నాయి.

''ఆయన ఇండియన్ బ్యాంక్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. నేను పని చేస్తున్న కాన్వెంట్ ప్రిన్సిపాల్‌గారికి బెస్ట్ ఫ్రెండ్‌ట. తరచూ వస్తుంటారు. ఏదో ఒక సందర్భంలో ప్రిన్సిపాల్‌గారు నా గురించి నా పరిస్థితి గురించి చెప్పారట. ఆయనకు నేను నచ్చానట. ప్రిన్సిపాల్‌గారు మాకు ఇంటర్వ్యూ కూడా ఏర్పాటుచేసారు.''

''ఊ! అయితే! ప్రిన్సిపాల్‌గారికి కూడా మన సంగతి తెలుసుకదా! అయినా అదంతా అనవసరం. నువ్వు ఒప్పుకున్నావా?''

''ఇక దెబ్బలు తట్టుకునే శక్తి ఈ శరీరానికే కాదు, మనసుకు కూడా లేదు రాజూ!''

అతనికి ఆమెలో వేదాలు వల్లిస్తున్న దెయ్యం కన్పిస్తున్నట్లుగా చూస్తుండిపోయాడు.

ఆమె అతని గుండెలమీద వెక్కి వెక్కి ఏడవసాగింది. విజ్ఞతగల అతను ఆమె చుట్టూ చేయి కూడా వేయలేదు.

ప్రేమ సముద్రంలోం పారేసుకున్న తన హృదయాన్ని తిరిగి వెతుక్కోవాలన్నమాట. అతని నిర్లిప్తత గమనించిన ఆమె అర్థం చేసుకున్నదానిలా దూరంగా జరిగింది.

''నువ్వు తప్పక రావాలి రాజూ!''

''ఇంతకాలం నీకు మనశ్శాంతినిచ్చానన్నావు. నాకు ఇప్పుడు ఆ అవసరం ఏర్పడేటట్టుంది.''

''నేను అయనతో ఆలోచించి చెబుతానన్నాను. ఆయన ఏకంగా శుభలేఖలు అచ్చువేయించుకునే వచ్చారు. అయితే నేను ఆయనకు మొదటి భార్యను కాదు. ఆయన మరో రెండేళ్ళల్లో రిటైర్ అవుతారు. ఆయన పిల్లలు పెళ్ళిళ్లయి కాపురాలు చేసుకుంటున్నారు. ఆయనకు ఏ బాధ్యతలూలేవు.''

అతనికి మరో షాక్!

''నాన్న నాకు తెలియకుండా ప్రిన్సిపాల్ ద్వారా ఆయనకు అమ్మేశారు.''

''అమ్మేశారా?'' సంభ్రమాశ్చర్యాలతో అడిగాడతను.

''నా సమస్యలన్నీ ఆయన పరిష్కరిస్తాను అని హామీ ఇచ్చారంటే అదేగా అర్థం!'' ఆమె పేలవంగా నవ్వింది.

''అవసరమైతే ఫోన్ చేయి రాజూ నీకే సహాయం కావాలన్నా!'' ఆమె కంఠంలోని వణుకు అతను గమనించేలోగా పర్సులోంచి తీసిన అయిడెంటిటీ కార్డు అతని చేతుల్లో వుంచి గిర్రున తిరిగి వెళ్లిపోయింది.

''ఎంత పని చేశావు రోజా?'' అతను గుండెలు చిక్కబట్టుకుని అచేతనంగా కూలబడ్డాడు.

★★★

''అబ్బాయిగారూ! మీకు ఫోన్!''

ఫైళ్ళ మధ్యవున్న రాజేష్ తల ఎత్తాడు.

''ఇంటి దగ్గర నుంచా? బహుశా కాత్యాయినికి నొప్పులు వస్తున్నాయేమో!'' అనుకుంటూ రిసీవర్ అందుకున్నాడు.

''హలో! రాజేష్ హియర్!''

''హలో రాజేష్! నేను సుప్రియను.''

అతను మంద్రంగా అడిగాడు.

''ఎలా వున్నావు సుప్రియా!''

''బ్రతికే వున్నాను.''

''అంటే నువ్వు కోరుకున్న జీవితం అంత బాగుందన్న మాట.''

''వాడ్డాయూ మీన్!''

''అవును. నా స్నేహితురాల్లా వున్నన్ని రోజులు నువ్వు జీవచ్ఛవానివేకదా!'' వ్యంగ్యంగా అన్నాడు.

''ఇప్పుడు మాత్రమేం! ఆ పోస్ట్‌కి నేను ఎప్పుడూ అర్హురాలినే! అది సరేగానీ నువ్వు ఎలా వున్నావు?''

''నా నిండు ప్రేమని తనలో దాచుకుని నా అనురాగాన్ని నా బిడ్డ రూపంలో నాకందించడానికి నా భార్య ప్రసవవేదన పడుతోంది. హాస్పిటల్‌లో చేర్పించాను. ఏ క్షణాన అయినా ఫోన్ రావచ్చు. ఆ శుభవార్త కోసం ఎదురు చూస్తున్నాను''. 'నా' అన్నచోట వీలైనంత వత్తి పలుకుతూ!

''నీకు అభ్యంతరం లేకపోతే ఒక్కసారి మా ఇంటికి రాగలవా! కారు పంపిస్తాను.''

''...''

''ప్లీజ్ రాజూ! ఒకే ఒక్కసారి. నా కథ వినిపించి నీ జాలి పొందడానికి కాదు. ఒక్కసారి రా. అప్పుడే సంవత్సరం కావస్తోంది నిన్ను చూసి.''

''కానీ నేను నెలకొకసారైనా నిన్ను చూస్తూనే వున్నాను. లయన్స్ క్లబ్ ప్రతి ఫంక్షన్‌కీ మీ దంపతులు హాజరు కావడం నాకు తెలుసు.''

''మరి...మరి ఏనాడూ పలకరించలేదేం? నేను చూడనే లేదు.''

''మన మొదటి పరిచయంనాటి నిండైన సుప్రియను అదే రూపాన్ని నా మనసులో అలాగే వుంచుకున్నాను. ఈనాడు అదే రూపంతో మహారాణిలా స్టేజీమీద ఉన్న నీ దగ్గరకు నేను ఏ మొహం పెట్టుకురాను. ఎంతైనా నాకు ప్రేమ విలువ తెలియజేసిన మొట్టమొదటి స్నేహితురాలివి.''

''ఆ స్నేహితురాలితో మనసువిప్పి మాట్లాడుకుందామనే రమ్మని కోరుతున్నాను. ప్లీజ్ రాజేష్!''

''సరే వస్తాను. అయితే ఇప్పుడు కాదు. నా భార్యకు పురుడు వచ్చినరోజు స్వీట్స్‌తో వస్తాను. బహుశా రేపు సాయంత్రానికి.

అతను రక్కున ఫోన్ పెట్టేశాడు.

★★★

వారం రోజుల తరువాత రాజేష్‌కి సుప్రియ నుంచి సుదీర్ఘమైన లేఖ అందింది.

''డియర్ రాజేష్!

నేను ఎన్ని జన్మలకైనా పూజించుకునే అత్యుత్తమ వ్యక్తిత్వంగల వాడిగా ఎంత ఎదిగిపోయావు నువ్వు? నీ ప్రేయసిగా తలవాల్చి నీ గుండెలపై నేను పొందిన మనశ్శాంతి సాక్షిగా, నా సమక్షంలో ఏ బలహీనతకీ లొంగని నీతో ఒక్క అబద్ధం చెప్పాను. అది...ఆయన నన్ను కొనుక్కున్నారని. కాదు రాజు. నేనే నా ఆకలిని తీర్చుకోవడంకోసం ఆయన భార్యగా అంగీకరించాను. నీ స్నేహితురాలిగా గడిపిన రోజుల్లో రెండురోజులకోసారి ఇంచుమించు భోజనం చేసిన నేను అదీ నీ కష్టార్జితంతో. కటిక దరిద్రంకంటే భయంకరమైనది ఈ ప్రపంచంలో మరొకటి ఏదీలేదని తెలుసుకున్నాను. కానీ ఎంతకాలం నిన్ను ఇబ్బంది పెట్టను? అందుకే బాగా ఆలోచించి ఆయన అడిగిన వెంటనే వివాహానికి అంగీకరించాను. నా ప్లాన్ ఒక్కటే. అప్పటికి నిరుద్యోగంతో బాధపడుతున్న నువ్వు నాకు ఎలాగూ స్నేహితుడిగా ఉంటావనే నమ్మకంతో ముందు ఆకలి బాధ తీరే ఆ మార్గాన్ని ఎంచుకున్నాను.

కానీ నా అంచనాలు తారుమారు చేస్తూ నువ్వు కాత్యాయనిని పెళ్ళి చేసుకున్నావు. మీరు ఎంతో అన్యోన్యంగా వున్నారన్న వార్త విన్నప్పుడు నేను చేసిన పొరపాటు నాకు అర్థమైంది. నీకు ఎల్ఐసి జాబ్ వచ్చిందని కూడా తెలిసింది అప్పుడే.

ఆయన పరమ అనుమానం మనిషి. తాగుబోతు. పైగా ఆయన తన భార్య పోయిన తరువాత జరిగిన యాక్సిడెంట్‌వల్ల సంసార జీవితానికి పనికిరారని డాక్టర్స్ రిపోర్ట్స్ చదివితే అర్థమయింది నాకు. కడుపులో ఆకలి తీరింది అనుకున్నానేగానీ ఉప్పూకారం సమృద్ధిగా చేరుతున్న నా శరీరం వయసు పోరును తట్టుకోలేక నా మనసు ఎదురు తిరగసాగింది. నేను చేసిన తప్పు నన్ను వెక్కిరించేది. శారీరక వాంఛకు లొంగిపొమ్మని శాసించేది. నా మనసును సమాధానపరచుకుని మళ్ళీ చివరకు నిన్ను ఆశ్రయించాను. వారంరోజుల క్రితం నువ్వు మా ఇంటికి అబ్బాయి పుట్టాడన్న శుభవార్తతో వచ్చినప్పుడు సిగ్గువిడిచి నా 'కోరిక' తీర్చమని అడిగాను. నువ్వు కోరకుండానే నా పుట్టినరోజున నేను ఇద్దామనుకున్న బహుమతి అదే. నీపట్ల ప్రేమ తమకంతో వున్న నా తనువు అటు ఆకలి బాధ తీర్చుకోవడానికి ఆయనను, కోరికలు తీర్చుకోవడానికి నిన్ను ఎంచుకుని ఈ అంపశయ్యా జీవితంలో అడుగుపెట్టిన నాకు నువ్వు చెప్పిన సమాధానం కళ్ళు తెరిపించింది.

''ఏమన్నావు నువ్వు?''

''కల్మషంలేని స్నేహం, మాలిన్యంలేని మనసుగల సుప్రియ నాకు ఎప్పుడూ ఆరాధ్య దేవతే!'' అని కదూ. అందుకే మళ్లీ నీకోసం సుప్రియనై పుట్టడం కోసం నిన్ను తలచుకుంటూ వెళ్లొస్తాను స్నేహితుడా.

మరు జన్మంటూ వుంటే అలా పిలిచే అర్హతను సంపాదించే నీ స్నేహితురాలినై పుట్టాలని కోరుకుంటూ సెలవ్!''

-సుప్రియ

అతను ఆ ఉత్తరాన్ని గుండెలకు అదుముకుని కళ్ళు మూసుకున్నాడు.

అతని హృదయపు పై అరలో సుప్రియ మాత్రం తన భార్యకు ఏనాటికీ చెప్పుకోలేని ప్రేమ మూర్తిగా సజీవంగా నవ్వుతోంది!

☆

